ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024


కొల్లూరు : వరద నీటిలో ఉన్న పెసర్లంక, ఆవులవారి పాలెం, గాజుల్లంక గ్రామాల ఏరియల్ వ్యూ

శాంతించిన కృష్ణమ్మ

తగ్గుముఖం పడుతున్న ఉధృతి

- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు
- వెలుగు చూస్తోన్న 'కన్నీటి' కష్టాలు
- కరకట్టకు గండ్లు, లీకులపై తొలుత ఆందోళన
- కలిసొచ్చిన సమన్వయం.. చర్యలతో తప్పిన గండం
- అర్ధరాత్రి దాటాక కరకట్టలను పరిశీలించిన మంత్రులు
- బ్యారేజి దిగువున ముంపులోనే లంకలు.. అల్లాడుతున్న ప్రజలు


సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలిస్తున్న రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తదితరులు


అమరావతి - విజయవాడ మార్గంలో పెదమద్దూరు వద్ద వరదనీరు


వెల్దుర్తి మండలంలో వరదతో పొలాల్లో ఇసుక మేటలు

మహోగ్రంగా ముంచుకొస్తోన్న కృష్ణమ్మ శాంతించింది. వర్షాలకు తోడు, పొంగి పొర్లుతున్న వాగులతో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఉధృతి మంగళవారం మధ్యాహ్నం కొంతమేర తగ్గింది. నాగార్జున సాగర్ జలాశయం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రికి సగానికి సగం పడిపోయింది. వరద ప్రవాహం సుమారు 2 లక్షల క్యూసెక్కులకుపైగా తగ్గింది. దీంతో నదీ పరివాహక గ్రామాలు, ప్రకాశం బ్యారేజి దిగువ లంకల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు ఇప్పుడిప్పుడే తెరుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు కరకట్ట వెంబడి జాగ్రత్తలు తీసుకుంటూ ఎక్కడా గండి పడకుండా, లీకులు సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇదే సమయంలో వరద ఉధృతి తగ్గడం.. బుధవారానికి ప్రవాహం ఇంకా తగ్గవచ్చన్న జలవనరుల శాఖ అంచనా నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల్లో టెన్షన్ తగ్గింది. లంకల్లో ఒక్క రోజులోనే మూడు అడుగుల మేర నీరు తగ్గుముఖం పట్టింది. కలిసి నడిచిన అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, చేయిచేయి కలిపిన గ్రామస్థుల కారణంగా పెనుగండం తప్పిందని భావించారు. అయితే ప్రవాహం తగ్గడంతో ఇప్పుడిప్పుడే నష్ట పరిణామాలు వెలుగుచూస్తున్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాల్సి ఉంది. ప్రజలు తేరుకుంటున్నా వరద కారణంగా ఇళ్లు, పశుపక్షాదులు, పంటలకు జరిగిన నష్టంపై ఆందోళన చెందుతున్నారు.

తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఎప్పుడు కరకట్టను కోసేస్తుందోనని.. ఎక్కడ గండిపడుతుందోనని.. ఎప్పుడు ఏ ఊరిపై వరద ప్రవాహం పడుతుందోనని బిక్కుబిక్కుమంటూ ఉన్న ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఎప్పుడు.. ఎక్కడ.. ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందినా ఆ పరిస్థితి లేకుండా పోయింది. పట్టపగ్గాలు లేకుండా.. ప్రవాహ ఉధృతితో పరుగులు పెడుతున్న కృష్ణమ్మ శాంతించింది. మంగళవారం నాగార్జున సాగర్ జలాశయం వద్ద వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఉపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు తెరుకుంటున్నారు. నదీ తీరం వైపు వెళ్లకుండా ఎక్కడికక్కడ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారానికి వరద ప్రవాహం ఇంకా తగ్గవచ్చని అంచనా. సోమవారం వరకు 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తే, అదే రోజు రాత్రి నుంచి వరద ఉధృతి తగ్గుతూ వస్తోంది. ప్రకాశం బ్యారేజి దగ్గర మంగళవారానికి 6.74 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం తగ్గింది. అటు పులిచింతల నుంచి కూడా మంగళవారం సాయంత్రం వరకు 4.20 లక్షల వరకు వరద నీటిని బ్యారేజికి విడుదల చేసినా, దానిని కూడా 3.87 లక్షల క్యూసెక్కులకు తగ్గించారు. అటు మునేరు, పాలేరు, కీసర వంటి వాగుల నుంచి కూడా వరద తగ్గిపోయింది. వర్షాలు కూడా లేకపోవడంతో వాగుల నుంచి ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల లోపే వరద నీరు బ్యారేజికి చేరుతోంది. బుధవారానికి వరద మరింత తగ్గిపోతుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు చెప్తున్నారు. అమరావతి, అచ్చంపేట, రెంటచింతల మండలాల్లోని లంక గ్రామాల్లో పరిస్థితులు ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తున్నాయి. లంక గ్రామాల్లో ముంపు అంత వేగంగా తగ్గడంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువున తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కరకట్టకు లోపల ఉన్న ఊళ్లన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లోని ఇళ్లు నాలుగు రోజులుగా నీటిలో నాని పోయి ఉన్నాయి. ఏ ఇల్లు ఎప్పుడు కూలుతుందోనని పాత ఇళ్లవారు భయపడుతున్నారు. ఇప్పుడిప్పుడే ముంపు నుంచి కొన్ని గ్రామాలు, లంకలు, అందులోని ఇళ్లు బయటపడుతున్నా నీరు బయటకు పోయిన తర్వాత మట్టి కూడా పేరుకుని, దానిని శుభ్రం చేసుకోవడం కష్టతరమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆయా మండలాల పరిధిలో చాలాచోట్ల ఇంకా రహదారులు బయట పడలేదు. పలు ప్రాంతాల్లో ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో విషసర్పాలు, దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. నీటిలో మూడు రోజులుగా చిక్కుకుపోయిన గ్రామాల వారికి అధికారులు ఆహారం, తాగునీటి డబ్బాలను మంగళవారం కూడా సరఫరా చేశారు. అయితే ఇవి అందరికీ సక్రమంగా చేరడంలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. జనం పరిస్థితి ఇలా ఉంటే.. మూగజీవాల కష్టాలు వర్ణనాతీతమే. వరద ఉధృతికి చాలా ఊళ్లలోని వాములు కొట్టుకుపోయాయి. మంగళవారం కూడా రోడ్లపైనా నీరు ప్రవహిస్తుండడంతో ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు రాలేకపోయారు. పశువులను మెరకల్లో కట్టేసే పరిస్థితిలేదు. వర్షాలు, వరదల కారణంగా గుంటూరు జిల్లాలోని 11 మండలాలు వరద, వర్ష ప్రభావానికి గురికాగా 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడగా 35,345.2 హెక్టార్లలో నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.


అమరావతి: పెదమద్దూరు వద్ద దెబ్బతిన్న పత్తిపంట


దాచేపల్లి : రామాపురంలో నీటమునిగిన పత్తి పైరును పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

లీకులు.. పోటుతో ఆందోళన..

కరకట్టలకు సమాంతరంగా సాగుతున్న నీటి ప్రవాహం ఓ వైపు.. లీకులతో నీటి చెమ్మలు కరకట్టలపైకి ఎగతన్నడం.. లీకుల గుర్తింపు.. మరోవైపు అమావాస్య ప్రభావంతో సముద్రంలో పోటుతో.. ఎప్పటికి వరద ముంపు తగ్గుతుందోనని ప్రజల నుంచి ప్రజాప్రతినిధులు వరకు కలవరపడ్డారు. కట్టలకు గండిపడే అవకాశం ఉంది అప్రమత్తంగా ఉండాలనే ముందస్తు హెచ్చరికలు.. గంటగంటకు పెరుగుతున్న నీటి ప్రవాహం నేపథ్యంలో కరకట్టలకు తాత్కాలిక మరమ్మతులతో ముప్పు తప్పింది. ఈ కృతువులో ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భాగస్వాములయ్యారు. రేపల్లె ప్రాంతంలో 2009 నాటి పరిణామాలు సంభవించే ప్రమాదం ఉందన్న ఆందోళన నెలకొన్నా.. ముప్పు తప్పేలా అందరూ కలిసికట్టుగా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటే వరకు కూడా కరకట్టల వద్దే అధికారులు ఉండగా మంత్రులు అనగాని, సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కరకట్టల పరిస్థితిని పరిశీలించారు. బ్యారేజీ ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో అధికారులతో పాటు ప్రజలు పెను గండం తప్పినట్లైందని ఊపిరి పీల్చుకున్నారు. రావి అనంతవరం, పెదపులివర్రు తదితర ప్రాంతాల వద్ద లీకులను గుర్తించిన వెంటనే పూడ్చేశారు. రైతుల సహకారం తీసుకుని, అధికారులను సమన్వయ పరిచి ఇసుక బస్తాలు, కంకరను తరలించి కరకట్టను ఎక్కడికక్కడ తాత్కాలి కంగా పటిష్ట పరిచే పనులను చేపట్టడంతో గండం గట్టెక్కారు.


పులిచింతల వద్ద వరద ఉధృతి

మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో రేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మంత్రులు, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ డూడీ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో సమీక్షించారు. అధికారులు సకాలంలో స్పందించి కృషి చేయడం వల్లే ఎక్కడా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలో వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. వరద ఉధృతికి కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి కరకట్ట బలోపేతానికి కృషి చేయాలన్నారు. లంక గ్రామాల్లో 1000 మంది లైన్‌మన్లను పంపించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. బురద, చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని బాపట్ల కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న 24 గ్రామాల్లోని 24 వేల మందికిపైగా జనం ఇబ్బందులు పడకుండా జనరేటర్లు, విద్యుత్ దీపాలు, ఆహార పదార్థాలు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. నాలుగు చోట్ల కరకట్ట బలహీనపడి లీక్ అవుతున్నా గ్రామస్తుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన నివారించగలిగామన్నారు. రేపల్లె మండలం పెనుమూడిలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంత్రులు సందర్శించి బాధితులకు అందుతున్న సేవల గురించి ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలించి బలహీనంగా ఉన్న ప్రాంతాలను ఇసుకగోతాలతో పటిష్ఠం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం

- మంత్రి మనోహర్

వరద బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొల్లిపర మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి ముంపు గ్రామాల్లో మూడో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. కరకట్ట కోతలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు తెలిపారు. ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. నదికి వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలకు అండగా ఉంటామన్నారు. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బి.రాజశేఖర్ కొల్లిపర మండలం అత్తలూరివారి పాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట గ్రామాల్లోని పంటలను డైరెక్టర్ డిల్లీరావు, శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు.


కొల్లూరు కరకట్ట దిగువున తగ్గని వరద ఉధృతి




రేపల్లె : పల్లెపాలెంలో తగ్గిన వరద ఉధృతి

కొల్లూరు: పోతార్లంకలో నీట మునిగిన విష్ణాలయం

కోటప్పకొండ వద్ద కోడి పందేలు

పోలీసుల దాడి.. రెండు కార్లు, 15 బైక్‌ల స్వాధీనం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 3: ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ సమీపంలోని అచ్చమ్మపాలెంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జోరుగా కోడిపందేలు సాగుతున్నాయి. నరసరావుపేట పట్టణం, సమీప గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో జూదరులు కోడిపందేల్లో పాల్గొనేందుకు తరలివస్తున్నారు. ఈ పందేలపై సమాచారంతో నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిశోర్ తన సిబ్బందితో మంగళవారం కోడిపందేల శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో పందేల నిర్వాహకుడితో పాటుగా 15 మంది జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 33,200 నగదు, రెండు కార్లు, 15 మోటారు సైకిళ్లతో పాటు పది పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.


పోలీసులు అదుపులోకి తీసుకున్న పందెం రాయుళ్లు

మిర్చి యార్డులో.. కలకలం

- సెక్రటరి, సిబ్బందితో బృందం భేటీ
- చెక్‌లిస్టు ప్రకారం ఫైళ్లు కావాలని ఆదేశాలు
- త్వరలో అవినీతి, అక్రమాలు నిగ్గు తేలే అవకాశం
- అప్పటి పాలకులు, అధికారుల గుండెల్లో గుబులు
- కమీషన్ వ్యాపారుల వాంగ్మూలాల నమోదుకు చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలకు రావడం కలకలం సృష్టించింది. ఆంధ్రజ్యోతి ముందే చెప్పిన విధం గా మంగళవారం ఉదయం ప్రాంతీయ నిఘా కార్యాలయం అధి కారులు యార్డు పరిపాలన భవనానికి చేరుకుని సెక్రెటరి ఐ వెంకటేశ్వరరెడ్డితో భేటీ అయ్యారు. తొలుత యార్డు కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2014-19 మధ్య జరిగిన వ్యవహారాలకు సంబంధించి తమకు ఫైళ్లు, డాక్యుమెంట్లు అందజేయాలని ఒక చెక్‌లిస్టును అందజేశారు. ఉదయం, మధ్యాహ్నం కూడా విజిలెన్స్ అధికారులు మిర్చియార్డులోనే ఉండి సమగ్రంగా వివరాలు సేకరించడం ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ దృష్టి సారించిందన్న సమాచారం యార్డు వర్గాల్లో మంగళవారం అంతా చర్చనీయాంశంగా మారింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఇటీవలే విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్‌గుప్తాని కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై డీజీ విచారణకు ఆదేశించడంతో ప్రాంతీయ కార్యాలయం సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దార్ కే నాగమల్లేశ్వరరావు, మరో ముగ్గురు సిబ్బందితో ఒక టీమ్‌ని నియమించారు. ఆ మేరకు విజిలెన్స్ బృందం తొలుత యార్డు పరిపాలన భవనానికి చేరుకుని తమ విచారణని ప్రారంభించింది. 2019 జూన్, జూలై, ఆగస్టులో 5 లక్షల మిర్చి టిక్కీలను ఈ-నామ్‌లో నమోదు చేయలేదు. వీటి విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. అప్పట్లో ఆరోపణలు రాగా దీనిపై మొక్కుబడి విచారణ జరిపి ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోకుండా మూసేశారని విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంలో అప్పటి సెక్రెటరితో పాటు 10 మంది సూపర్‌వైజర్ల పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు కోరారు. ప్రధానంగా 2023లో కేవలం రెండు నెలల వ్యవధిలో జరిగిన కమీషన్ వ్యాపారుల 400 రెన్యువల్స్, 180 వరకు జరిగిన పార్టనర్‌షిప్ డీడ్‌లకు సంబంధించి భారీగా నగదు చేతులు మారినట్లు విజిలెన్స్‌కు ఫిర్యాదు అందడంతో దీనికి సంబంధించిన ఫైళ్లను తమకు పంపాలని ఆదేశించారు. కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు ఏ విధంగా ఇస్తారు. వాటి విధివిధానాలను తెలియజేయాలని కోరారు. అలానే యార్డులో వేమెన్ల వ్యవస్థ గురించి, మచ్చుకాయల మాఫియా గురించి వాకబు చేశారు. యార్డులో గేట్ల వద్ద ఏర్పాటు చేసిన వేబ్రిడ్జీలలో ఒక్కటి కూడా పని చేయకపోవడంపై ఆశ్చర్యానికి గురయ్యారు. యార్డులోకి వచ్చే సరుకుకు సక్రమంగా అకౌంటబిలిటీ లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదని గుర్తించారు. లైసెన్సులను వేరే వ్యక్తులకు లీజుకు ఇవ్వడం వంటి వివరాలు కూడా వివిధ వర్గాల నుంచి సేకరించారు. జీఎస్టీ రూపంలో ఆదాయానికి పడిన గండి గురించి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ తాము ఫైళ్లన్నింటిని తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించి ఆ తర్వాత వ్యాపారులు, ఉద్యోగుల వాంగ్మూలాలు నమోదు చేస్తామన్నారు. చివరిగా అవినీతి, అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.


మిర్చియార్డులో తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అధికారులు

దిక్సూచి DIKSUCHI

నిట్ ఆంధ్రలో పీహెచ్‌డీ



పశ్చిమగోదావరి జిల్లా-తాడేపల్లి గూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆంధ్ర)- విశ్వేశ్వరాయ స్కీమ్ కింద పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో 5 సీట్లు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో 2 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

అర్హత: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అభ్యర్థులు ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. గేట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లు/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్‌లు/ఇండస్ట్రీలలో కనీసం రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750లు ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.



- ★ **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- ★ **ఈ-మెయిల్:** hdadmissions@nitandhra.ac.in
- ★ **వెబ్‌సైట్:** www.nitandhra.ac.in

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'బీటెక్ & బీఎస్+ఎంఎస్' ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిని అనుసరిస్తారు.

జేఎన్‌టీయూఏలో ఐసీపీ సెకండ్ ఫేజ్

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. అభ్యర్థులు మొదటి మూడేళ్లు అనంతపురం జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. సీఎస్‌ఈ, ఈసీఈ విభాగాలు ఎంచుకోవచ్చు.

- సీఎస్‌ఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(సీఎస్‌ఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంఎస్(కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్-ఏఐ&ఎంఎల్) చదవాల్సి ఉంటుంది.
- ఈసీఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(ఈసీఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), ఎంఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్, సెన్సార్స్ అండ్ సిస్టమ్స్) చదవాలి.

మిగిలిన సీట్ల వివరాలు: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్‌ఈ)లో 7 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)లో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఉండాలి.

- **సెకండ్ ఫేజ్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in



Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

Nikon Scholarship Program

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/NIKON12

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zqexLBVలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



20 నుంచి అక్కినేని చలనచిత్రోత్సవం

లెజండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఆయన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్.హెచ్.ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్కినేని కుటుంబ సభ్యుల సహకారంతో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్, పీవీఆర్ ఐనాక్స్ లతో కలసి 'ఏయన్నార్ 100- కింగ్ ఆఫ్ ద సిల్వర్‌స్క్రీన్' పేరుతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ మేకర్, ఎఫ్.హెచ్.ఐ. డైరెక్టర్ శివేంద్ర సింగ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన అక్కినేని అద్భుత చిత్రాలు పదింటిని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాలతో సహా 25 ప్రాంతాల్లో ప్రదర్శిస్తామని ఆయన వెల్లడించారు. ఇంతకుముందు అమితాబ్ బచ్చన్, దిలీప్‌కుమార్, దేవానంద్ చిత్రోత్సవాలను ఎఫ్.హెచ్.ఐ నిర్వహించినట్లు శివేంద్ర సింగ్ పేర్కొన్నారు.

వరద బాధితులకు సినీ ప్రముఖుల విరాళం







ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అనుకున్నా, తన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆయన చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి చెరో రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. 'భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం నన్ను కలచివేసింది, ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు. మహేశ్ బాబు సైతం రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. వరదల్లో ముంపునకు గురైన ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ కలసి రెండు రాష్ట్రాలకు కలిపి రూ. 50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు హీరో సిద్ధు జొన్నలగడ్డ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. 30 లక్షల సాయాన్ని ప్రకటించారు. హీరో విష్వక్సేన్ రెండు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి రూ. 10 లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల రూ. 5 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు ప్రకటించగా, నిర్మాత బన్నీవాస్ 'ఆయ్' చిత్రం వసూళ్లలో పాతిక శాతాన్ని ఏపీ వరద బాధితులకు విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. సహాయనిధికి విరాళాలను ప్రకటించిన సినీ ప్రముఖులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు.

ఆ తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది


బాలకృష్ణ

'తాతమ్మ కల' చిత్రంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి విదితమే. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యాభై ఏళ్ల క్రితం మా నాన్నగారు నా నుదిటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. యాభై ఏళ్ల నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగు జాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని చెప్పారు బాలకృష్ణ. రెండు తెలుగు రాష్ట్రాలను వరద ముంచెత్తుతున్న ఈ తరుణంలో ఆయన స్పందిస్తూ 'ఈ విపత్కర పరిస్థితుల్లో బాధాతప్త హృదయంతో నా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో అతి త్వరలోనే మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వెల్లడించారు.

నాన్నే నా హీరో



ఎనభైల దశకంలో బాలీవుడ్‌లో విలన్‌గా ఒక వెలుగు వెలిగిన శక్తి కపూర్ మంగళవారం తన 72వ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నారు. ఎంతో మంది ఆయనకు అభినందనలు తెలిపారు కానీ కుమార్తె శ్రద్ధా కపూర్ ఇచ్చిన పొగడ్త శక్తికపూర్‌కు ఎంతో శక్తినిచ్చింది. మరికొన్నేళ్ల పాటు జీవించాలనే ఉత్సాహాన్ని కలిగించింది. తండ్రితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'నాన్నే నా హీరో. తండ్రి అండదండలు ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం' అని కామెంట్ పెట్టింది శ్రద్ధా. ఆమె నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సంచలన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది.

వైరముత్తుపై పోరాటంలో వెనకడుగే లేదు


చిన్మయి శ్రీపాద

ఎన్ని బెదిరింపులు వచ్చినా, పరిశ్రమ బహిష్కరణ విధించినా వెరవకుండా దక్షిణాది చిత్రసీమలో 'మీటూ' ఉద్యమానికి చుక్కానిలా నిలిచారు ప్రముఖ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. కొన్నేళ్లుగా ఆమె సోషల్ మీడియా వేదికగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో ఆమె మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ పాటల రచయిత వైరముత్తు చేతిలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, ఆ కేసులో తాను ఇంకా పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. ప్రముఖ గీత రచయిత, పద్మ పురస్కార గ్రహీత, సంగీత నాటక అకాడమీ సహా పలు జాతీయ పురస్కారల విజేత అయిన సెలబ్రిటీ చేతిలో తాను వేధింపులకు గురయ్యానంటూ చిన్మయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాతో పాటు మరికొందరు మహిళలు స్వయంగా మీడియా ముందుకు వచ్చి నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని తమిళ సినీ పెద్దలందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని నిరసన వ్యక్తం చేశారు. వైరముత్తుకు తమిళనాడులోని రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లే ఇన్నేళ్లైనా తనకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. అతను ఎలాంటి వాడో అందరికీ తెలిసిందే, అయినా ఆయనపై చర్యలు తీసుకోకపోగా నన్నే బలిపశువును చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'తమిళ చిత్ర పరిశ్రమ నా పై కక్ష గట్టింది. అప్పటి డీఎంకే నేత, ఇప్పటి బీజేపీ నాయకుడు.. డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ రాధారవి నాపై బహిష్కరణ వేటు వేశార'ని చెప్పారు. 'మెజారిటీ తమిళ సమాజం, నా తోటి సంగీత కళాకారులు సైతం తప్పంతా నాదే అన్నట్లు దుర్భాషలాడారు. అయినా వెనకడుగు వేయకుండా, వైరముత్తు వేధింపులపై ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నాను. ముందుముందూ ఇది కొనసాగిస్తాను' అని చిన్మయి చెప్పారు.

'ప్రేమమ్' హీరోపై అత్యాచారం కేసు



జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో పలువురు మాలీవుడ్ ప్రముఖులపై వరుసగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. తాజాగా 'ప్రేమమ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు నివిన్ పౌలీపై అత్యాచారం కేసు నమోదైంది. ఓ నటి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనను దుబాయ్ తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ పూర్తి చేసిన పోలీసులు నివిన్ సహా మరో ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు

తమిళ అగ్రహీరో రజనీకాంత్‌ను 'జస్టిస్ హేమ కమిటీ గురించి మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా కోరగా, 'దాని గురించి నాకేం తెలియదు, క్షమించండి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కొంతమంది మీటూ ఉద్యమకారులు, నెటిజన్లు రజనీకాంత్ వైఖరిని తప్పుపట్టిన నేపథ్యంలో తమిళ నటి రాధికా శరత్‌కుమార్ ఆయన్ని వెనుకేసుకొచ్చారు. రజనీకాంత్‌కు నిజంగానే హేమ కమిటీ గురించి ఏమీ తెలియదనీ, అందుకే ఆయన దాని గురించి మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆయన మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం బాధాకరమన్నారు.

కొత్తగా..

ఆడ లేడీస్ వర్సెస్ మగ జెంట్స్



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా పండగకు పది రోజుల ముందే అంటే అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన సరసన రీతూ వర్మ నటించారు. సినిమాలో ఆడ లేడీస్, మగ జెంట్స్ మధ్య ఉండే ఆసక్తికరమైన కంటెంట్ అలరిస్తుందని శ్రీవిష్ణు, రీతూ వర్మ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.మీరా జాస్మిన్, సునీల్, దక్ష నగర్కార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తుపాకులతో పోలీసు బందీ



సన్నీ అఖిల్, గిద్దేష్ అజయ్ ఘోష్ తదితరులు నటించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ లాగానే ఫస్ట్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరినైనా తాళ్లతోనూ, సంకెళ్లతోనో బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది' అని అభినందించారు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

సాగుదారుని పేరు నమోదు చేయండి

● వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి రాజశేఖర్



దంతలూరులో వర్షానికి మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

కొల్లిపర, సెప్టెంబరు 3 : కృష్ణానది వరదకు, వర్షాలకు ముంపునకు గురైన పొలాల్లో పంట నష్టానికి నిజమైన సాగుదారుని పేరు నమోదు చేయాలని వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బి.రాజశేఖర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట గ్రామాల్లో వర్షాలకు, వరదలకు ముంపునకు గురైన పంటలను వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, వ్యవసాయ, రెవెన్యూ, శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. పంట నష్టం వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వర్షపు నీరు బయటకు పోయేలా తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఈ పంటలో తప్పనిసరిగా సాగుదారుని పేరు నమోదు చేసి వారికి ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ వరద ద్వారా ముంపునకు గురైన ప్రతి పొలాన్ని పరిశీలించి పంట నష్టం అంచనా వేసి నివేదిక తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ శారదా జయలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనసింహ, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఏడీఏ ఉషారాణి, వ్యవసాయాధికారులు వెంకట్రావు, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 3: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మూడో రోజు బుధవారం కూడా సెలవు ప్రకటిస్తు కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది వారు పని చేస్తున్న పాఠశాలలకు హాజరు కావాలని, పాఠశాలల్లో పారిశుధ్య సమస్యలు పరిష్కరించి తిరిగి పాఠశాలలు పూర్తిస్థాయిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎవరైనా పాఠశాలలు, కళాశాలలు తెరిస్తే సంబంధిత యాజమాన్యాలపై క్రమశిక్షణా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

● అధికారుల పని తీరు భేష్
● నిర్వాసితులకు నాణ్యమైన భోజనం అందించండి
● వరద పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
● సమీక్షా సమావేశంలో మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్, మంత్రి రవికుమార్, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 3: అధికారులు మెరుగ్గా పని చేయడంతో వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులతో కలిసి కొల్లూరు కరకట్ట వద్ద నిర్వాసితులకు పడవల ద్వారా ఆహార పదార్థాల సరఫరాను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యాశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిర్వాసితులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో మంత్రులు, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రమాదం పొంచి ఉందని గుర్తించి అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు ఎంతో బాధ్యతగా పని చేశారని అధికారులు, సిబ్బందిని అభినందించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి బలోపేతానికి కృషి చేయాలన్నారు. రహదారిపై పడిన గండ్లు పూడ్చాలన్నారు. లంక గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణకు సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ నుంచి 1000 మంది లైన్‌మెన్‌లను పంపించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. 1000 సోలార్ ల్యాంప్‌లు ఇస్తామని చెప్పారు. రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయన్నారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేస్తే ఎలా ఉంటుందో చేసి చూపించారని చెప్పారు. నిత్యవసర సరకులు, వైద్యం సకాలంలో అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గతంలో కంటే వరద అధికంగా రావడంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురైయ్యాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ వరద ఉధృతి 8.64 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో కొంతమేరకు ప్రమాదం తగ్గినట్లేనన్నారు. వరద అనంతరం లంక గ్రామాల్లో పేరుకుపోయిన బురద, చెత్తను తొలగించాలని సూచించారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా వరద ప్రవాహం 11.50 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 24 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. ప్రజలు 24 వేల మందికి పైగా లంక గ్రామాల్లో ఉండిపోయారని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి 750 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. ఆహార పదార్థాలను అందించేందుకు 40 మరబోట్లు నడుపుతున్నామని, 200 లైఫ్ జాకెట్లు సిద్ధం చేశామన్నారు. 65 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. వరద విపత్తుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ పలు సూచనలు చేశారని చెప్పారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలకు నిత్యవసర సరకులు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఒక కుటుంబానికి 25 కేజీల బియ్యం, నూనె ప్యాకెట్, కిలో చొప్పున కందిపప్పు, పంచదార, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, చేనేతలు, మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ అధికారికంగా ప్రకటించే వరకు లంక గ్రామాల్లో ప్రజలు ఎలాంటి రాకపోకలు సాగించరాదని సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవో, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 3: వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం కొల్లిపర మండల పరిధిలోని అత్తలూరిపారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెం గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. వరద ముంపు గ్రామాల్లో మూడో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలను ఆయన పరిశీలించారు. కరకట్ట ఎక్కడైన కోతకు గురైందేమోనని పరిశీలించి ఇరిగేషన్ అధికారులను తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కృష్ణానదికి వరదనీటి ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కృష్ణానది కుడి కరకట్ట 8 చోట్ల కోతకు గురైందనీ, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి తగ్గేవరకు లంకగ్రామాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. కొత్తూరులంక, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం గ్రామాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. పునరావాస కేంద్రాలకు 215 మందిని తరలించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ సుమారు 67వేల కుటుంబాలకు 25 కిలోల బియ్యంతోపాటు కిలో చొప్పున కందిపప్పు, పంచదార, లీటర్ పామాయిల్ అందజేసినట్లు తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, నాయకులు కొండా శివారెడ్డి, అడపా నారాయణరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, బొమ్ము శివరామిరెడ్డి, మొవ్వా వెంకయ్య తదితరులు ఉన్నారు.

సీఐనా.. వైసీపీ కార్యకర్తనా?

● ఇడుపులపాయలో వైఎస్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు
● గతంలో పులివెందులలో జరిగిన జయంతికి కూడా..
● గత ఎన్నికల సమయంలో అరండల్‌పేట సీఐగా విధులు
● ఓ ఆసుపత్రి వివాదంలో వీఆర్‌కు



వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వరరెడ్డి(సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

గుంటూరు, సెప్టెంబరు 3: ఆయన సీఐనా.? లేదంటే వైసీపీ కార్యకర్తనా? అనేది పోలీస్ ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం రేంజ్ వీఆర్‌లో ఉన్న ఐ వెంకటేశ్వరరెడ్డి అనే సీఐ సోమవారం కడప జిల్లాలోని ఇడుపులపాయలో జరిగిన దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడం పోలీస్ శాఖలోనే కాక, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వైఎస్ కుటుంబంపై ఎంత అభిమానం ఉంటే మాత్రం పోలీస్ శాఖలో బాధ్యత కలిగిన సీఐ హోదాలో ఉన్న ఆ అధికారి బహిరంగంగా వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన్ను వైసీపీ ప్రభుత్వం అరండల్‌పేట సీఐగా నియమించింది. అంతకుముందు వైసీపీ ప్రభుత్వంలో ఆయన ఏపీ, తమిళనాడు సరిహద్దు స్టేషన్ సూళ్ళూరుపేటలో ఏకంగా నాలుగేళ్లు విధులు నిర్వహించారు. ఆయన ప్రత్యేకత ఏమిటంటే వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉండటమే. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డితోనూ సంబంధాలు ఉన్నాయి. ఏదైనా కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరెడ్డి కనిపిస్తే జగన్ ఆయన్ను అన్నా అని పిలుస్తాడని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చొరవతోనే ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా సూళ్ళూరుపేట సీఐగా విధులు నిర్వహించారు. ఆయన అక్కడ పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయనకు ఏకంగా సీఎంతోనే పరిచయం ఉందనే ప్రచారంతో పోలీస్ ఉన్నతాధికారులు సైతం ఆయన విషయంలో పట్టించుకునేవారు కాదని పోలీస్ వర్గాలు అంటున్నాయి. గత ఎన్నికల సమయంలో అరండల్‌పేట సీఐగా ఆయన వైసీపీ విజయానికి తన వంతు కృషి చేసినట్లు కూటమి పార్టీలు అప్పట్లోనే ఆరోపించాయి. కొరిటెపాడులో జరిగిన జనసేన, వైసీపీ ఫ్లెక్సీల వివాదంలోనూ, అలాగే కొరిటెపాడు సెంటర్‌లో వైసీపీ విగ్రహానికి అవకాశం ఇచ్చి, ఎన్టీఆర్ విగ్రహం పెట్టేందుకు యత్నించిన టీడీపీ వారిని కేసుల పేరుతో బెదిరించడం, పోలింగ్ రోజు బూత్‌ల వద్ద టీడీపీ వారి పట్ల అనుచితంగా ప్రవర్తించడం వంటి అనేక ఏకపక్ష కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక ఎన్నికల తరువాత అరండల్‌పేటలో ఓ ఐపీఎస్ అధికారి సతీమణి, మరో వైద్యుడికి మధ్య ఓ క్లినిక్ భాగస్వామ్యం విషయంలో వివాదం తలెత్తింది. ఈ విషయంలో ఆయన ఐపీఎస్ అధికారి సతీమణి తరఫున రంగంలోకి దిగి వైద్య దంపతుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. పసిపిల్లతో ఉన్న వైద్యురాలి నుంచి రాత్రి సమయంలో సెల్‌ఫోన్ లాక్కొని, కనీసం పసిపాపకు పాలు ఇచ్చే అవకాశం ఇవ్వకుండా నిర్బంధించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాధిత వైద్య దంపతులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంలోనే సీఐను వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న ఆయన ఏకంగా వైసీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇంత బహిరంగంగా ఆయన జగన్ పాల్గొన్న వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడం వైసీపీ కార్యకర్తలకే విస్మయాన్ని కలిగించింది. ఆయన పాల్గొన్న ఫొటోను వైసీపీ కార్యకర్తలే సోషల్ మీడియాలో వైరల్ చేయడం గమనార్హం. ఆయన సీఐనా? వైసీపీ కార్యకర్తనా? అంటూ నెటిజన్‌లు ప్రశ్నిస్తున్నారు.

యరపతినేని సేవలపై రైల్వే ప్రశంస

● అధికారిక ఫేస్‌బుక్‌లో వెల్లడి

పిడుగురాళ్ళ, సెప్టెంబరు 3: విపత్కర పరిస్థితుల్లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రయాణికులకు చేసిన సేవలను దక్షణ మధ్య రైల్వే ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ మేరకు దక్షణ మధ్య రైల్వేశాఖకు చెందిన అధికారిక ఫేస్‌బుక్‌లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందించిన సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. అల్పపీడనం ప్రభావంతో రైళ్లను నడికూడి రైల్వేజంక్షన్ మీదుగా దారి మళ్లించడంతో సుమారు 10 వేల మంది ప్రయాణికులకు ఆయన పాలు, పండ్లు, వెజ్ బిర్యాని అందించారని ఫొటోలతో సహా రైల్వేశాఖ అధికారిక ఫేస్‌బుక్‌లో వెల్లడించింది. ఆదివారం మధ్యాహ్నం 15 గంటల నుంచి రాత్రి 22 గంటల వరకు వేలాది మంది రైల్వే ప్రయాణికులకు ఆహార పదార్థాలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్, పార్టీ శ్రేణులు అందజేశారని రైల్వేశాఖ వెల్లడించింది.



నడికూడి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆహారం అందజేస్తున్న నిఖిల్

గుంటూరు గర్భిణికి బాంబే బ్లడ్

●దానం చేసిన గుంతకల్లు వాసి

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 3: గుంటూరుకు చెందిన ఓ గర్భిణికి ప్రసవ సమయంలో అవసరమైన ఓ నెగిటివ్ బాంబే గ్రూప్ రక్తాన్ని అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన పరుశురామ్ దానం చేశాడు. గుంటూరు సాయిరత్న ఆసుపత్రిలో ప్రసవం కోసం కస్తూరి అనే మహిళ చేరారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. ఆమెది అరుదైన ఓ నెగిటివ్ బాంబే బ్లడ్ గ్రూప్ కావడంతో కుటుంబ సభ్యులు ఆ రక్తం కోసం కర్నూలులోని ఓ రక్తదాతకు సంప్రదించారు. గుంతకల్లులో పరుశురామ్‌ది అదే గ్రూప్ అని తెలుసుకుని.. కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు నుంచి మంగళవారం ఉదయం గుంతకల్లుకు చేరుకున్నారు. పట్టణంలోని గోపీ బ్లడ్ బ్యాంకులో పరుశురామ్ రక్తదానం చేశాడు. ఆ రక్తాన్ని తీసుకుని కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు సాయంత్రం రైలులో బయలుదేరారు. రక్తదానం చేసిన పరుశురామ్‌కు కస్తూరి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



గోపి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న పరుశురామ్

18న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

గుంటూరు, సెప్టెంబరు 3: ఈ నెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 16న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 17వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 18న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 19వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోఛార్జి రూ. 2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

హెలికాప్టర్ ద్వారా 21 మంది తరలింపు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని తుళ్లూరు మండలం పెదలంకలో కృష్ణానది వరద ప్రవాహంలో చిక్కుకొన్న 21 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు హెలికాప్టర్ సాయం తీసుకొన్నారు. విడతల వారీగా అందరిని ఎన్‌టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి మంగళవారం తరలించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకొన్నారు. గుంటూరు ఆర్‌డీవో పి.శ్రీకర్, ఏఎస్‌పీ కొల్లి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా ఉపాధి అధికారి రఘు, తుళ్లూరు డీఎస్పీ మల్లికార్జునరావు ఈ ఆపరేషన్‌ని పర్యవేక్షించారు. అలానే ఉద్దండ్రాయునిపాలెంలో 250 మందిని పడవల ద్వారా పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి భోజన సదుపాయం కల్పించారు. 204 పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ నాటు పడవలో ప్రయాణిస్తూ కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెంలో గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించారు. తాడేపల్లి మండలంలోని మహానాడు ప్రాంతంలో వరదనీరు చేరిన నివాసాల వద్దకు వెళ్లి ప్రజలను పునరావాస కేంద్రాలకు రావాలని విజ్ఞప్తి చేసి ఒప్పించి తీసుకొచ్చారు.

వరద బాధితులకు భాష్యం చేయూత



వరద బాధితులకు ఆహారం అందించేందుకు వెళ్లే వ్యాను వద్ద ఉపాధ్యాయులు, సిబ్బంది

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3: కృష్ణా జిల్లాలో వరద బాధితులకు చేయూత అందించే లక్ష్యంతో భాష్యం విద్యాసంస్థలు తమవంతు వితరణ ప్రకటించాయని సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరద బాధితుల కోసం 70 వేల పులిహోర ప్యాకెట్లు, పెరుగన్నం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యం వల్ల ప్రజలు పడుతున్న కష్టాలు ఎవరికీ రాకూడదన్నారు. వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో బాధితుల్ని ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థలు తమ తరుపున స్వయంగా తయారు చేసిన పులిహోర, పెరుగన్నం ప్యాకెట్ల మంగళవారం విజయవాడ తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

వరద భయంతో ఆగిన గుండె



కొల్లూరు శ్మశాన వాటిక కూడా వరద నీటిలోనే ఉండడంతో కరకట్టపైనే దహన సంస్కారాలు

తెనాలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంటి చుట్టూ ఎటు చూసినా వరద.. బయటపడే మార్గమే లేదు! అప్పటి వరకూ ఇంటి బయటే ఉన్న నీరు ఒక్కసారిగా ఇంటిలోపలికి చొచ్చుకొచ్చింది. క్రమంగా నీటి మట్టం పెరుగుతుండడంతో ఆ కుటుంబం భయపడిపోయింది. దీంతో కుటుంబ పెద్ద కృష్ణారావు(65) మరింత ఆందోళన చెందారు. హఠాత్తుగా గుండె ఆగి తనువు చాలించారు. మరోవైపు దహన సంస్కారాలు చేద్దామన్నా, శ్మశాన వాటిక కూడా వరదలో మునిగిపోవడంతో కుటుంబ సభ్యుల ఆవేదనకు అంతులేకుండాపోయింది. హృదయ విదారకమైన ఈ ఘటన బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో చోటుచేసుకుంది. కృష్ణానది పొంగి ప్రవహించడంతో మండలంలోని ఆవులవారిపాలెం గ్రామం వరదలో చిక్కుకుంది. చుట్టూ నీరు చేరడంతో రెండు రోజులుగా గ్రామస్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. శనివారం రాత్రి వరద ఉధృతి పెరగడం, ఇళ్లలోకి నీరు చేరుతుండడంతో కృష్ణారావు తీవ్ర ఆందోళన చెందారు. సురక్షిత ప్రదేశానికి ఎక్కడికైనా వెళ్లిపోదామని భావించినా అక్కడి నుంచి బయటికి తీసుకురాలేని పరిస్థితి. కృష్ణా నది వరద ప్రవాహవేగం ఎక్కువగా ఉండడంతో పడవలను కూడా అధికారులు అనుమతించలేదు. రాత్రి సమయం కావడం, పడవల్లో శ్రేయస్కరం కాదని కుటుంబ సభ్యులు చెప్పినా శాంతించని కృష్ణారావు.. తీవ్ర ఆందోళనకు గురై చివరికి గుండెపోటుతో తనువు చాలించారు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆ బాధను దిగమింగుకుని తండ్రి దేహానికి దహన సంస్కారాలు చేద్దామనుకున్నా చుట్టూ నీరు తప్ప, శ్మశానం కాదుకదా, కనీసం నీరులేని మెరక భూమే కనిపించలేదు. దీంతో దిక్కుతోచక కుమారుడు వెంకటేశ్ అధికారులకు మంగళవారం సమాచారం అందించాడు. వెంటనే అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను లైవ్ బోట్ సాయంతో పంపించి మృతదేహాన్ని గ్రామం నుంచి వరద నీటిని దాటించి కరకట్టపైకి చేర్చగలిగారు. అయితే కొల్లూరు శ్మశాన వాటిక కూడా వరద నీటిలోనే ఉండడంతో చివరికి కొల్లూరు-దోనేపూడి మధ్య కృష్ణా కుడి కరకట్టపైనే చితి ఏర్పాటు చేసి దహన సంస్కారాలు పూర్తిచేశారు. ఈ దృశ్యాలు చూపరులను కూడా కంటతడిపెట్టించాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

42,589 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 45,449 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 42,589 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 21,569 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	16000	334	8200	14000
నెంబరు. 5	8000	13500	నెంబరు. 5	8000	13000
273	9600	13000	273	10500	11000
341	8000	14500	341	9500	12500
4884	8900	11500	4884	11000	11500
సూపర్ 10	-	-	సూపర్ 10	12000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600	తేజ	7500	18300
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	8000	13700	దేవనూరు డీలక్స్	10000	16000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	4500	11500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

వరద సాయంపై మంత్రితో చర్చించిన ఎమ్మెల్యే ప్రవీణ్


ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి కొల్లు రవీంద్రతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 3: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విజయవాడ పరిసర ప్రాంతా ల్లో జరుగుతున్న వరద సహాయక కార్యక్రమాల గురించి చర్చించా రు. రాష్ట్ర గనులు, ఎక్సై జ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విజయ వాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావులతో మంగళవారం ప్రవీణ్ చర్చించారు.

బాధితుల సహాయక చర్యల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు ముంపునకు గురైన విజయవాడ పట్టణంలో బాధితుల సహాయక చర్యల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి విజయ వాడ పట్టణంలోని సింగ్‌నగర్‌లో పర్యటించారు. ప్రజలకు మంచినీరు, పాలు, భోజనం అందించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాల గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు.

వావిలాల ఘాట్ ప్రాంతంలో మురుగునీటి సమస్య


వావిలాల ఘాట్ ప్రాంతంలో నిలిచి ఉన్న మురుగునీరు

సత్తెనపల్లి, సెప్టెంబరు 3: పట్టణంలోని వావిలాల ఘాట్ ప్రాంతంలో పారిశుధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతంలో పారిశుధ్యం క్షీణించి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీనివల్ల ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు. ఆ ప్రాంతంలో 50 కుటుంబాలకు పైగా నివాసాలు ఉంటున్నారు. మౌళిక వసతులు కూడా లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 3: భారీ వర్షాల కారణంగా, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా జ్వరాల భారినపడిన బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పుతుంబాక భవనంలో జరిగిన సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోను, పీహెచ్‌సీల్లోను మందులు, వైద్య సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. సమావేశంలో గద్దె చలమయ్య, ఆంజ నేయనాయక్, రవి, లక్ష్మీశ్వరరెడ్డి, డీ విమల, బాలకృష్ణ మల్లేశ్వరి, మహేష్, హనుమంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : వైద్యాధికారి బిందుమాధవి

గురజాలటౌన్, సెప్టెంబరు 3: వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారి బిందుమాధవి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎన్జీవోహోంలో మండలంలోని వైద్య సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. వర్షాలకు గ్రామాల్లో వరదనీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీనివల్ల జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. అలాగే ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. వరదనీరు కుంటగా ఉన్నా, డ్రైనేజీ సమస్య ఉన్నా వైద్యసిబ్బంది లిఖిత పూర్వకంగా పంచాయతీ సెక్రటరీకి అందించి సమ స్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ళ పురపాలక సంఘం
హెచ్చరిక

ఆర్.ఓ.సి.నెం. 341/2024/జి1 తేది : 03-09-2024

ప్రజలకు తెలియచేయడమే ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరచిన స్థలము / ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారముగా లే అవుట్లు వేసి ఉన్నారు.

క్ర. సం.	అనధికార లేఅవుట్ పేరు / ఏరియా పేరు	విస్తీర్ణము (ఎకాలో)	సర్వే నెంబరు	గ్రామము పేరు	మున్సిపాలిటీ పేరు
1	సిరి డెవలపర్స్ (లైనిస్ నగర్)	1.50	1059	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
2	కల్లం టౌన్ షిప్	2.54	68/ఏ1	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
3	1132 కెవి కరెంట్ ఆఫీస్ కొండమోడు	3.0	892/41 892/42 892/45	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
4	ఆర్& ఆర్ సెంటర్ దగ్గర	0.4	897/21	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
5	అంభేద్కర్ నగర్ వెనుక	0.16	393	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
6	1132 కెవి కరెంట్ ఆఫీస్, కొండమోడు	2.60	892/45	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
7	శ్రీనివాస కాలనీ	5.0	307, 308	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
8	రసూల్ పేట	0.40	340	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
9	ఆర్&బి బ్రిడ్జి ప్రక్కన	1.02	394	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
10	4కె డెవలపర్స్	2.0	130/7	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
11	టిటిడి కళ్యాణ మండపం వెనుక	2	130/1	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
12	జానపాడు రోడ్డు	1.3	186	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
13	రామ్ టౌన్‌షిప్ ప్రక్కన (బైపాస్ రోడ్డు)	4.83	68	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
14	బిపిసిఎల్ పెట్రోల్ బంక్ దగ్గర (బైపాస్ రోడ్డు)	708/9	1.32	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
15	రామ్ టౌన్ షిప్	5	83,84	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
16	ఎ.కె. టౌన్ షిప్	5	79,80,83	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
17	సూర్య సెమ్ వెనుక	1.5	127/8,104	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
18	అంజని టౌన్ షిప్ (ఎబిసి స్కూల్ ఎదురు)	4.5	124/2,105	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
19	ఖలీల్ బార్ మరియు రెస్టారెంట్ ఎదురు	0.52	124/1	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
20	ఖలీల్ బార్ మరియు రెస్టారెంట్ ఎదురు	0.60	122/1, 124/1	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
21	ఖలీల్ బార్ మరియు రెస్టారెంట్ ఎదురు	1.78	122/1	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
22	ఖలీల్ బార్ మరియు రెస్టారెంట్ ఎదురు	1.95	118, 122/1బి1 122/1బి2	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
23	గ్రీన్ సిటీ (ఖలీల్ బార్ మరియు రెస్టారెంట్ ఎదురు)	2.15	115/2	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
24	చెరువు కట్ట బజార్	0.30	571	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
25	పి.డబ్ల్యూ.డి కాలనీ	2.0	242	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
26	టిటిడి కళ్యాణ మండపం వెనుక	3.02	130/16/ఏ	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
27	సిరి గార్డెన్స్ (బజాజ్ షోరూమ్ వెనుక)	9.92	131/ఏ 130/31/ఏ	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
28	కల్లం టౌన్‌షిప్ పటేల్ కోర్టు	4.01	41/ఏ,44/ఏ	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
29	కల్లం టౌన్ షిప్	3.22	130/1,130/2	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
30	ఆక్స్‌ఫర్డ్ స్కూల్ దగ్గర	19	153,154, 177,178	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
31	కల్లం టౌన్ షిప్	2.09	127/2	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ
32	సూర్య సెమ్ వెనుక	2.5	103	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ

కావున పైన తెలిపిన లే అవుట్ల నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ప్లాట్లకు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్ చేయబడవు మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. మౌలిక వసతులు అనగా రోడ్డు, కరెంటు, నీరు, డ్రైనేజి సదుపాయాలు కల్పించబడవు. దీనిని గమనించవలసినదిగా విజ్ఞప్తి

గమనిక : అనధికారముగా లే అవుట్లు వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానుల లేదా డెవలపర్స్ పైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

సం/- **కమీషనరు,** పిడుగురాళ్ళ పురపాలక సంఘం

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది


వర్షానికి దెబ్బతిన్న పంటను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

- వైసీపీ నేతలు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి
- జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 3: రైతులు అధైర్యపడవద్దు.. ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కొత్తపల్లిలో దెబ్బతిన్న పంట పొలాలను మంగళవారం ఆయన వ్యవసాయ శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. ప్రతి రైతుకు కావాల్సిన ఎరువులు, యూరియా పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భారీ వర్షాలకు ప్రజలు నష్టపోకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాల మొత్తాన్ని విచార ణ చేయించి చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి అభివృద్ధి పనులు చేయకుండా సిగ్గు లేకుండా నీతులు చెబుతున్నారని విమర్శించారు. విజయవాడ ప్రజలు అల్లాడిపోతుంటే చేతనైన సాయం చేయా లిగానీ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వస్తే జగన్ చేసిన అన్యాయాలు, అక్రమాలు, సాక్ష్యాలతో నిరూపిస్తామని భయపడి అసెంబ్లీకి రాకుండా ఢిల్లీ, బెంగళూరు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఛీకొట్టినా జగన్ సిగ్గులేకుం డా మాట్లాడుతున్నారన్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పర్యవేక్షిస్తూ డ్రోన్‌ల సాయంతో ఆహా రం, వారి రక్షణకు చర్యలు చేపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వెంట ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏవో లక్ష్మారెడ్డి, టీడీపీ నేతలు కుర్రి శివారెడ్డి, యువనేత జూలకంటి అక్కిరెడ్డి, మదార్‌సాహెబ్, అన్వర్ తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి, సెప్టెంబరు 3: వర్షాల ధాటికి దెబ్బతిన్న పంట పొలాలను మంగళవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. మండలంలోని మండాది సమీపంలోని రచ్చమలపాడు చప్టాపై ప్రవహించిన వాగు ఉధృతికి కట్టలు తెగి పొలాలు తుడిచి పెట్టుకుపోయాయి. ఆ పొలాలను ఎమ్మెల్యే పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయన వెంట తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, తెలుగు యువత నేత అక్కిరెడ్డి, మండల అధ్యక్షుడు శివారెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, అంకిరెడ్డి, ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏవో పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు


రామాపురం పునరావాస కేంద్రంలో ఉన్న పల్లె కారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

దాచేపల్లి, సెప్టెంబరు 3: కృష్ణానది వరద ప్రవాహంతో నదీ తీర ప్రాంతంలో పంటలు నష్టపోయిన రైతులకు, తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించి నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలోని పునరా వాస కేంద్రంలో నిత్యావసర సరుకులను కలెక్టర్ అందజేశారు. జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులను ఆయన పరామర్శించారు. పునరావాస కేంద్రంలో మరిన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వరద నీటి కారణంగా మత్స్యకారుల పడవలకు పరిహారం అందజేస్తామన్నారు. గ్రామంలో డ్వాక్రా గ్రూపులకు చెందిన 28 మంది మహిళలకు 2లక్షల 80 వేల రూపాయల వడ్డీలేని రుణాలకు సంబంధించి చెక్కులు పంపిణీ చేశారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం

రామాపురం గ్రామ పర్యటనలో భాగంగా గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటను కలెక్టర్ పరిశీలించారు. పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల రామాపురం గ్రామంలోని ఇళ్లల్లోకి నీరు చేరడం, వందల ఎకరాల పంటలకు నష్టం చేకూరడం, పలువురు రైతులు పంట వేసేందుకు వెనుకాడే పరిస్థితులపై ప్రభుత్వానికి తెలియజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. నదీ తీరంలో నివాసం ఏర్పాటు చేసుకున్న మత్స్యకారులకు ఇళ్లపట్టాలు మంజూరు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మురళీ, ఉద్యాన అధికారి రమణారెడ్డి, డీఎంహెచ్‌వో రవి, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, డీఎల్‌డీఏ గబ్రూనాయక్, తహసీల్దార్ కుటుంబరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


వరద బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

అచ్చంపేట, సెప్టెంబరు 3: అచ్చంపేటలోని వీరభద్రకాలనీ వరద బాధితులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం వెయ్యి భోజన ప్యాకెట్లు, రెండువేల వాటర్ ప్యాకెట్లను టీడీపీ నాయకులు అందజేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో మూడు రోజులుగా బాధితులకు సహాయ కార్యక్ర మాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మాస్టర్ మైండ్ విద్యాసంస్థల సహకారంతో వీటిని అందించినట్లు నాయకులు తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు టాటా సహకారం

బెల్లంకొండ, సెప్టెంబరు 3: పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు టాటా వారి సహకారంతో మంగళవారం తహసీల్దార్ అస్రిఫున్నీసా బేగం పండ్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ నిర్వాసితులకు టాటా వారి సేవలు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, వీఆర్‌వో వెంకయ్య, గుంటూరు సాయి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, టాటా వాటర్ బాటిల్ డీలర్ శివ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

క్రోసూరు, సెప్టెంబరు 3: క్రోసూరు చెంచుకాలనీ వరద బాధితులకు మంగళవారం రెవెన్యూ అధికారులు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సుమారు వందమంది బాధితులకు 25 కిలోల చొప్పున బియ్యం, కందిపప్పు, నూనె ప్యాకెట్లు, పంచదార పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. క్రోసూరులోని ఎస్టీ కాలనీలో మాస్టర్ మైండ్ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3: జూలకల్లు, జానపాడు, పిడుగురాళ్ల, అనుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శివనాగిరెడ్డి తెలిపారు.

తాడువాయి వద్ద మృతదేహం లభ్యం

అచ్చంపేట, సెప్టెంబరు 3: వరదల కారణంగా మండలంలోని తాడువాయి అడ్డవాగు వద్ద వాగులో మునిగి పోయిన భూక్యా గోపీ నాయక్(30) మృతదేహాన్ని మంగళవారం వెలికితీశారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గోపీ మృతదేహం లభ్యమవటంతో తాడువాయి పంచాయతీ పరిధిలోని సంద్రతండాలో విషాదచాయలు అలముకున్నాయి.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

దాచేపల్లి, సెప్టెంబరు 3: నడికుడి రైల్వేజంక్షన్‌లో కదిలే రైలు దిగుతూ జారిపడిన యువకుడు తన కుడిచేతిని కోల్పోయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ నుంచి నడికుడిలో దిగిన యువకుడు ప్రమాదవశాత్తు జారిపడటంతో రైలుకింద తన చెయ్యిపడి ఇరిగిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన యువకుడిని, విరిగిపోయిన చెయ్యిని అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోగంటివారిపాలెం పునరావాస కేంద్రంలో ఆశా డే

అచ్చంపేట, సెప్టెంబరు 3: మండలంలోని కోగంటివారిపాలెంలోని వరద బాధిత పునరావాస కేంద్రంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బీ రవి ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ఇటీవల ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, గ్రామాల్లో ముందస్తు చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, డాక్టర్ రాంబాబు, సీహెచ్‌వో హర్షవర్ధన్, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరావు, ఏఎన్‌ఎం సంతోషి పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా కె.సంజీవరావు

రెంటచింతల, సెప్టెంబరు 3: కొద్ది రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కృష్ణానదికి సమీపంలోని గ్రామాల్లో వరద పరిస్థితిని సమీక్షించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి కె.సంజీవరావును నియమించినట్లు తహసీల్దార్ జి.కరుణకుమార్ చెప్పారు. దామెరపాడుకు ఎంపీడీవో మహాలక్ష్మి, సత్రశాలకు దుర్గి తహసీల్దార్ ఫణీంద్ర, మల్లవరానికి తహసీల్దార్ కరుణకుమార్‌ను నియమించారు. వీరితోపాటు వీఆర్వోలు, ఇతర సిబ్బందిని నియమించి 8గంటలు డ్యూటీ చేసేలా మూడు షిఫ్టులను ఏర్పాటు చేశారన్నారు.

ఏపీపీయూఎస్‌ఎంఏ అధ్యక్షుడిగా కేవీ రమణ

మాచర్లటౌన్, సెప్టెంబరు 3: ఏపీపీయుఎస్‌ఎంఏ మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణంలోని వాణీవిద్యానికేతన్ ప్రిన్సిపాల్ కేవీ రమణ ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా జెనిత్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వేముల వెంకటేశ్వర్లు, కె.వెంకట్రావు, జాయింట్ సెక్రటరీలుగా డి.శ్రీనివాసరావు, వి.హరికారెడ్డి, ట్రెజరర్‌గా ఎస్ శ్రీనివాసరావు, సబ్ ట్రెజరర్‌గా సురేష్‌కుమార్, చీఫ్ అడ్వయిజర్‌గా రామకృష్ణశాస్త్రి ఎన్నికయ్యారు.

దుర్గిలో బీజేపీ సభ్యత్వ నమోదు

దుర్గి, సెప్టెంబరు 3: దుర్గిలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు ఆధ్వర్యాన సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో తుపాకుల కోటేశ్వరరావు, బీసీ మోర్చా అధ్యక్షుడు తక్కులపాటి కోటేశ్వరరావు, మన్నెం మల్లయ్య, మరియదాసు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్


తహసీల్దార్ జియా ఉల్‌హక్

మాచర్లటౌన్, సెప్టెంబరు 3: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జియాఉల్‌హక్ కోరారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మరో మూడు, నాలుగు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. చెరువులు, వాగుల వద్ద రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే సెల్ 97058 49345కు సమాచారం అందించాలని తహసీల్దార్ కోరారు.

విజయవాడకు వెళ్లిన పారిశుధ్య సిబ్బంది


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, సెప్టెంబరు 3: విజయవాడలో పారిశుధ్య పనుల నిమిత్తం పట్టణానికి చెందిన పారిశుధ్య సిబ్బంది మంగళవారం విజయవాడకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ బస్సును మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ కరోనా సమయంలో సేవలందించిన మాచర్ల మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఇప్పుడు విజయవాడలో విపత్తు నివారణ చర్యల్లో కూడా భాగమవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలను పరిశీలించిన అధికారులు

మాచవరం, సెప్టెంబరు 3: మండలంలోని కృష్ణా పరివాహక గ్రామాలైన రేగులగడ్డ, వేమవరం, గోవిందాపురం గ్రామాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. కృష్ణానది వరద ప్రవాహాన్ని పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఆయా గ్రామాల వీఆర్‌వోలను, వీఆర్‌ఏలను, పంచాయతీ సిబ్బందిని అప్రమత్తంగా ఉండి సమాచారాన్ని ఎప్పటికప్పుడు మండల కేంద్రానికి చేరవేయాలని ఆదేశించారు. పరిశీలించిన వారిలో తహసీల్దార్ క్షమారాణి, పలువురు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వీఆర్‌వోలు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

చావపాడు, పెదమద్దూరు వరద బాధితులకు ఎమ్మెల్యే ప్రవీణ్ భరోసా


ముంపు గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, సెప్టెంబరు 3: కృష్ణానదికి వచ్చిన వరద ప్రభావంతో జల దిగ్బంధంలో చిక్కుకున్న పెదమద్దూరు, చావపాడు గ్రామాల పరిధిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధితులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పరామర్శించారు. పెదమద్దూరులో ఓ పౌల్ట్రీ ఫారంలో 38వేల కోళ్లు వరదలో మృత్యువాత పడ్డాయి. రైతులు సాగుచేసిన పంటలు నీటమునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. పెదమద్దూరులో ముంపునకు గురైన గృహాలను పరిశీలించి బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కల్పించారు. వరదనీరు తగ్గుముఖం పట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పెదమద్దూరు వాగు చప్టాపై వరద నీరు కొంతమేర తగ్గినా అమరావతి-విజయవాడ వాహనాల రాకపోకలు జరగటంలేదు. వరద బాధితులకు పలువురు దాతలు తమ సహాయ సహకారాలు అందించడం హర్షణీయమన్నారు. జరిగిన పంటనష్టాన్ని, వరద బాధితులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి త్వరలో ప్రభుత్వానికి పంపిస్తామని ప్రవీణ్ తెలిపారు. ఎమ్మెల్యే వెంట స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వరద ప్రాంతంలో ఎమ్మెల్యే కన్నా పర్యటన


విజయవాడలోని 15వ డివిజన్‌లోని వరద ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం విజయవాడలోని వరద ముంపు ప్రాంత మైన 15వ డివిజన్‌లో పర్యటించారు. వరద బాధితులను చంద్రబాబు ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. అధికారులతో కలసి వరద ముంపుకాలనీల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వరద ప్రాంతాల్లో బాధితులకు ఆహార పదార్థాలు అందుతున్నాయా? లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఇళ్లవద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 15వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఆహార పొట్లాలు, పాలు కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు.

అధిక తేమ వల్ల మొక్కలు పోషకాలను తీసుకోలేదు

- ఉద్యానశాఖ అధికారి మోహన్

మాచవరం, సెప్టెంబరు 3: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పంట పొలాల్లో అధిక తేమ ఉండటం వల్ల మొక్కలు వేర్ల ద్వారా పోషకాలను తీసుకోలేదని ఉద్యానశాఖ అధికారి మోహన్ రైతులకు తెలిపారు. మంగళవారం మండలంలోని పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల్లో మిర్చి, పసుపు, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక తేమ వల్ల మొక్కలు ఉరకెత్తి తలలు వాలుస్తాయని, అంతేగాకుండా తెగుళ్ళ కూడా ఆశించే అవకాశం ఉంటుందన్నారు. దీని నివారణకు పంటల్లో ఉన్న తేమ శాతాన్ని తగ్గించుకోవాలని, నీరు నిలబడి ఉంటే బయటకు వెళ్ళగొట్టాలని తెలిపారు. తేమ నివారణకు పది లీటర్ల నీటిలో 50 గ్రాములు అన్న బేరీతో పాటు పది గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సహాయకులు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

వరద ప్రాంతాల్లో మన్నెం పర్యటన


విజయవాడలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న మన్నెం శివ నాగమల్లేశ్వరరావు

సత్తెనపల్లి, సెప్టెంబరు 3 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విజయవాడలోని వరద ప్రాంతాలైన 16, 17, 18, 19, 20, 21, 22, 23 డివిజన్‌లలో సత్తెనపల్లి టీడీపీ నేత మన్నెం శివ నాగమల్లేశ్వరరావు నియోజకవర్గానికి చెందిన వంద మంది కార్యకర్తలతో కలసి ఆయా డివిజన్‌లలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, పొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, యువగళం పాదయాత్ర కో-ఆర్డినేటర్ ఏ రవి నాయుడుతో కలసి ఆయా డివిజన్‌లలోని పునరావాస కేంద్రాల వద్దకు వెళ్లి రెండు వేల మంది వరద బాధితులకు పులిహోర ప్యాకెట్లు, పెరుగు అన్నం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ళతో పాటు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

శాంసన్ మృతి టీడీపీకి తీరనిలోటు: పల్లా శ్రీనివాస్

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్ల శాంసన్ మరణం టీడీపీకి తీరని లోటని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అన్నారు. 'తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య సోదరులు వర్ల శాంసన్ (84) మంగళవారం పిడుగురాళ్లలో మృతి చెందారు. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఆయన మృతి పార్టీకి తీరని లోటు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం శాంసన్ విశేష కృషి చేశారు. పార్టీలోని వివిధ విభాగాల్లో సేవలందించారు. శాంసన్ మృతికి సంతాపాన్ని, వర్ల రామయ్య కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సాయం కోసం వెళ్లి గల్లంతు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3: కోనంకి గ్రామంలో వాగులో ఉన్న మోటర్‌ను పైకి తీసేందుకు సాయంగా వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన మంగళవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోనంకి గ్రామానికి చెందిన పుణ్యాల సాంబశివారెడ్డి పొలానికి ఉన్న విద్యుత్ మోటర్ అధిక వర్షాల కారణంగా గ్రామ సమీపంలోని పిల్లేరు వాగు ప్రవాహానికి మునిగిపోయింది. మోటర్‌ను పైకి తీసేందుకు సాంబశివారెడ్డి కోనంకి గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరావు (43)ను సాయంగా వెంట తీసుకెళ్లాడు. మోటర్‌ను పైకితీస్తున్న క్రమంలో ఇద్దరు నీళ్లలో మునిగిపోగా సాంబశివారెడ్డి ఒడ్డుకు చేరుకున్నాడు. సాయంగా వెళ్లిన శ్రీనివాసరావు నీటి ప్రవాహానికి మునిగిపోయాడు. అతడి కుటుంబసభ్యులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు.

పంటలకు అపార నష్టం

వెల్దుర్తి, సెప్టెంబరు 3: నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. ప్రధానంగా మండలంలోని రచ్చమలపాడు చప్టా, పట్లవీడు వాగు, బోదలవీడు వాగు ఉధృతికి సమీపంలోని పంటపొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇటీవల సాగు చేసిన మిర్చి పైరు మొక్కలతో సహా తుడిచిపెట్టుకుపోగా కొన్ని పొలాల్లో మేటలు వేసి పూడుకుపోయాయి. ఇప్పటివరకు మండలపరిధిలో సుమారు 500 ఎకరాల వరకు నష్టం చేకూరినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

11సీట్లకు దించినా జగన్‌కు సిగ్గు రాలేదు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు 151 నుంచి 11కు దించినా ఇంకా సిగ్గురాలేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో ఘాటుగా విమర్శించారు. ప్రజలందరూ విపత్కర పరిస్థితిలో నిలువ నీడలేక ఇబ్బందులతో సతమతం అవుతుంటే కనీసం ఉడతాభక్తిగా కూడా సాయంచేయని వ్యక్తి ఇవాళ చంద్రబాబు నాయుడుని మేనుఫ్లేటెడ్ రెయిన్ అని విమర్శిస్తున్నాడంటే ఇంతకంటే సిగ్గుమాలిన చర్య మరొకటి ఉండదన్నారు. అమరావతిని చంపడం కోసం ప్రకాశం బ్యారేజ్‌లో పడవలను అడ్డుపెట్టి, అమరావతి ముంపునకు గురయిందని ప్రచారం చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. రికార్డుస్థాయిలో వరదనీరు వచ్చినా ప్రాణనష్టం జరగకుండా, నిద్రలేకుండా అర్ధరాత్రి సమయంలో ప్రజల కోసం చంద్రబాబు నాయుడు పరితపిస్తే ప్యాలెస్‌లో పడుకున్న వ్యక్తి వచ్చి విమర్శలు చేస్తుంటే ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు ఇంటి ముంపు నుంచి కాపాడుకోవటం కోసం బుడమేరు గేట్లు ఎత్తివేసి విజయవాడను ముంపునకు గురిచేశారని మాట్లాడటంపై వైసీపీ నాయకులే నవ్వుకుంటున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాటలు చూస్తుంటే ఒక అనుమానం కలుగుతుందని, ఈ రోజు కూడా ప్రకాశం బ్యారేజిలో నాలుగు పడవలు వచ్చి చేరాయని, దీని వెనుక జగన్‌మోహన్‌రెడ్డిది ఏదో కుట్రపన్నాడనే అనుమానం కలుగుతుందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఇంటిని ముంచేందుకు ఇటువంటి కుట్రలు పన్నాడని, సాధ్యపడకపోవడంతో ఈ సమయంలో ఇటువంటి చర్యలకు పాల్పడ్డారనే అనుమానం కలుగుతోందన్నారు. సాయంచేయి, చేతకకాకపోతే గమ్మున కూర్చోవాలికానీ ఇటువంటి మాటలు సరికాదని హితవు పలికారు.

వైరల్ జ్వరాలు ప్రబలకుండా చూడాలి

● జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

రొంపిచర్ల, సెప్టెంబరు 3: మండలంలో జ్వరాలు ప్రబలకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మంగళవారం తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆషా కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల దృష్ట్యా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలకు దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయి, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

రొంపిచర్ల, సెప్టెంబరు 3: పంట కోత ప్రయోగం పై రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. సహాయ గణాంక అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దిగుబడుల అంచనాలో పంట కోత ప్రయోగం కీలకమైందన్నారు. వాటిని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద చేపట్టాలన్నారు. జిల్లాలో ఆహార, ఆహారేతర పంటల ఉత్పత్తిని అంచనా వేసేందుకు ఖరీఫ్, రబీలో 42 పంట కోత ప్రయోగాలు చేయాలని నిర్ణయించామన్నారు. బీమా పంటలైన వరి, మినుము, మిరప, కంది పంటలకు పంటల బీమా యాప్, బీమా రాని పంటలకు రాష్ట్ర యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలను చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులు పంట కోత ప్రయోగాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. బాధ్యతతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శివలలిత, తహసీల్దార్ నిర్మల పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

రొంపిచర్ల, సెప్టెంబరు 3: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ నిర్మల మంగళవారం పరిశీలించారు. రొంపిచర్ల జడ్పీ పాఠశాలలోని తరగతి గదిని ఆమె పరిశీలించారు. పట్టభద్రుల ఎన్నికకు గదిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి కాలనీలో నీటి నిల్వలను తొలగించిన వైద్య సిబ్బంది

రొంపిచర్ల, సెప్టెంబరు 3: మండలంలోని రొంపిచర్ల సుబ్బారెడ్డి కాలనీలో నీటి నిల్వలు ఉన్న చోట మందును పిచికారి చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా జ్వరాల సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, హెల్త్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పత్తి పొలాలను పరిశీలించిన జేసీ, డీఏవో



యడ్లపాడు మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పైరును పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా జేసీ సూరజ్, డీఏవో మురళి తదితరులు

యడ్లపాడు, సెప్టెంబరు 3: అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పొలాలను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె ధనుంజయ్, జిల్లా వ్యవసాయాధికారి మురళిలు మంగళవారం పరిశీలించారు. మండలంలోని లింగారావుపాలెం, సొలస గ్రామాల పరిధిలో అధిక వర్షాలకు, వాగు ముంపునకు గురైె దెబ్బతిన్న పత్తి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నక్కవాగు పొంగి పొర్లడంతో పాటు పొలాల్లోని మురుగునీరు బయటకు వెళ్ళే కాలువలకు మరమ్మతులు నిర్వహించకపోవడంతో అధిక నష్టం వాటిల్లిందని రైతులు జేసీకి వివరించారు. మురుగునీరు బయటకు పోయేలా డ్రెయిన్లను మరమ్మతులు చేయించి మేలు చేయాలని రైతులు జేసీకి విజ్ఞప్తి చేశారు. స్పందించిన జేసీ అందుకు సంబంధించిన వివరాలను తనకు పంపించాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులు సాగుచేసిన పంటల వివరాలు, ఎకరాకు అయిన పెట్టుబడి, అధిక వర్షాలకు జరిగిన నష్టం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంట పూర్తిగా నష్టపోయిన రైతులు తిరిగి వేయబోయే పంటల గురించి ఆరా తీశారు. జిల్లా వ్యవసాయాధికారి మురళి జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు 8వేల హెక్టార్లలో పత్తి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు జేసీకి వివరించారు. దెబ్బతిన్న పంట నష్టం అంచనాలకు సంబంధించిన ఎన్యూమరేషన్‌ను బుధవారం నుంచి ప్రారంభించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ వెంకటరాములు, జిల్లా శిక్షణ కో-ఆర్డినేటర్ శివకుమారి, ఆర్డీవో సరోజిని, ఏడీఏ మస్తానమ్మ, ఎంఏవో సీహెచ్ సరిత, రైతులు ఉన్నారు.

పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

నాదెండ్ల, సెప్టెంబరు 3: మండల కేంద్రమైన నాదెండ్లతో పాటు యడ్లపాడు మండలంలోని లింగారావుపాలెం, సొలస గ్రామాల్లోని పత్తి పొలాలను శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. అధిక వర్షాలతో ప్రభావితమైన పత్తి పొలాలను ఆ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు, లాంఫాం శాస్త్రవేత్త ఎస్.సాంబశివరావులు రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నిలవ ఉన్న నీటిని బయటకు పంపి ఎకరాకు 30 కిలోల యూరియా, 15కిలోల పొటాష్‌ను వేయాలన్నారు. పూత, పిందె రాలకుండా ఉండేందుకు ఎకరాకు నాలుగు వందల గ్రాముల అగ్రోమిన్ మ్యాక్ (ఫార్ములా-4)లు పిచికారి చేయాలని సూచించారు. పది గ్రాముల యూరియా, పది గ్రాముల మెగ్నీషియంను లీటరు నీటితో కలిపి పిచికారి చేస్తే పంటలు ఉరకెత్తవన్నారు. వాడిపోయిన మొక్కలకు కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను ఒక లీటరు నీటిలో మూడు గ్రాములు కలిపి మొక్కల వేదుళ్ళ చుట్టూ వేయాలని సూచించారు. పొలాలను పరిశీలించిన వారిలో జిల్లా వనరుల కేంద్రం శిక్షణ కో-ఆర్డినేటర్ ఎం శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఎంఏవో శ్రీలత, ఏవోలు హరి ప్రసాదు, సీహెచ్ సరితలు ఉన్నారు.



నాదెండ్లలో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

విజయవాడను పూర్వస్థితికి తీసుకొస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు




భవానీపురం ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3: చరిత్రలో ఎరగని విపత్తుతో విజయవాడ నగరం నీట మునిగిందని, పూర్వస్థితికి తీసుకొచ్చే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం విజయవాడ నగరంలోని 40వ డివిజన్ భవానీపురం బస్టాండ్, బాలభాస్కర్ నగర్‌లలో పర్యటించారు. వరద బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కాలువలను శుభ్రం చేయకపోవటం, సిల్టు తొలగించకపోవడం, పూడిక తీయకపోవడంతో వరద ముప్పు తలెత్తిందన్నారు. ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన నాయకత్వం మనకు ఉందన్నారు. చంద్రబాబు నాయుడు గత మూడు రోజులుగా విజయవాడలోనే మకాంవేసి మరీ పనుల్ని పర్యవేక్షిస్తున్నారన్నారు. త్వరలోనే మొత్తం వ్యవస్థను మెరుగుపరిచి, ప్రతి బాధితుడికి సైతం న్యాయం చేస్తామన్నారు. ప్రతి గడపకు సాయం అందించిన తర్వాతనే ఇంటికి వెళ్లానని చెప్పడం చంద్రబాబునాయుడు సమర్థతలకు నిదర్శనం అన్నారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో విపత్తులు వచ్చినా, ఏ ఒక్క బాధితుడికి న్యాయం చేసిన దాఖలాల్లేవన్నారు. చివరికి సమస్యలను గమనించే పరిస్థితి కూడా లేదన్నారు. సమస్యలను తప్పించుకుని తిరిగే జగన్‌రెడ్డి, ఇప్పుడు ఏదో ఉద్ధరించినట్లు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విజయవాడ మొత్తాన్ని సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత నారా చంద్రబాబు నాయుడు తీసుకున్నారని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని డాక్టర్ చదలవాడ కోరారు.

విజయవాడకు నీళ్ల ట్యాంకర్ల తరలింపు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3: తుపాను బాధితుల సహాయార్థం నరసరావుపేట నుంచి 10 నీళ్ల ట్యాంకర్లు మంగళవారం తరలివెళ్ళాయి. నీళ్ళ ట్యాంకర్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ గడచిన మూడు రోజులుగా తుపాను బీభత్సం వలన విజయవాడ ప్రాంతం అతాలకుతలం అయిందన్నారు. రెండు లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తాగునీటి కొరత లేకుండా 10 వాటర్ ట్యాంక్‌లు పంపించడం జరిగిందన్నారు. ప్రతి డివిజన్‌కు రెండు పెట్టడానికి ట్యాంకర్లు పంపించామన్నారు. తనను 40వ డివిజన్‌లో ఇన్‌చార్జిగా వేశారని, అందరంవెళ్ళి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డయేరియా, మలేరియా రాకుండా ఫాగింగ్ చేశామన్నారు. ఉదయం 25 క్వింటాల్ బియ్యాన్ని 500 మందికి పంచటానికి తీసుకెలుతున్నామన్నారు. బియ్యంతో పాటు కేజీ కందిపప్పు, రెండువేల పామాయిల్ పాకెట్లు, రెండు వేల వాటర్ బాటిల్స్, 500 బియ్యం పాకెట్లు తీసుకెళ్లి పంచుతామన్నారు. కార్యక్రమంలో కొవూరు బాబు, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, షేక్ మాబు, అత్తులూరి సుబ్బారావు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నీళ్ళ ట్యాంకర్ల ట్రాక్టర్లకు జెండా ఊపిప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

వరదలపై అధికారులతో ఎమ్మెల్యే జీవీ సమీక్ష

వినుకొండ, సెప్టెంబరు 3: కొన్నిరోజుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో విపత్తు నిర్వహణకు సంబంధించి ఎక్కడా సమన్వయం లోపం రాకూడదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టంచేశారు. ముఖ్యమైన విభాగాల అధికారులు అందరూ అందుబాటులో ఉంటూ ప్రజలకు భరోసా కల్పించాలని ఆయన అధికారులకు దిశ, నిర్దేశం చేశారు. పలు ప్రాంతాల్లో ముంచెత్తిన భారీ వర్షాలు ఉండవచ్చని హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో వరద పరిస్థితులపై జూమ్ యాప్‌ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో వరద ప్రవాహంపై తీసుకోవాల్సిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పంటలపై వర్షాల ప్రభావం రైతులకు సాయం అందించాల్సిన అవసరం ఉంటే ఆ వివరాలు తెలియచేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మరోసారి స్పష్టం చేశారు. రెవెన్యూ విభాగంతో కలిసి పంటనష్టం అంచనాలను వేగంగా రూపొందించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలన్నారు. పంచాయతీరాజ్ విభాగం తరుపున గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు, తాగునీరు, ముంపునకు గురైన ప్రాంతాల్లో బ్లీచింగ్ వంటి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి, ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

పెరిగిన ధరలకు వ్యతిరేకంగా నిరసన

వినుకొండటౌన్, సెప్టెంబరు 3: దేశంలో పెరిగిన అధిక ధరలు నియంత్రించడంలో కేంద్ర పూర్తిగా విఫలమైందని పల్నాడు జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి మారుతీవరప్రసాద్ ఎద్దేవా చేశారు. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శివయ్య స్థూపం సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో అధిక ధరలు తగ్గిస్తామని నమ్మబలికి, పెరిగిన ధరలను తగ్గించడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందన్నారు. ప్రజలు కొనుగోలుచేసే నిత్యావసరధరలు 200శాతం మేరకు పెగిగాయని, సామాన్యులు నిత్యావసర వస్తువులు కొనుగోలుచేసే పరిస్థితి లేదన్నారు. దేశ జీడీపీ పడిపోయి, దేశం అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో బూదాల శ్రీను, ఉలవలపూడి రాము, ఆర్.వందనం, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, కిశోర్, సాంబయ్య, మల్లికార్జున, దావీదు, మార్కు, వెంకటేశ్వర్లు, యూనీస్, రాములమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

107 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 3: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ద్విచక్ర వాహన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ లైసెన్సులు లేని, సరైన అనుమతి పత్రాలులేని వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడపడంపై తనిఖీలు నిర్వహించామన్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి 7 గంటల వరకు ఈ డ్రైవ్ నిర్వహించామన్నారు. డ్రైవ్‌లో రెండో పట్టణ సీఐ హైమారావు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన పదిమంది ఎస్‌ఐలు రెండో పట్టణ ఎస్‌ఐ అశోక్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి సరైన అనుమతి పత్రాలు సమర్పించి యజమానులు తీసుకువెళ్లచ్చని డీఎస్పీ తెలిపారు. లేకుంటే వాటిని కోర్టులో జమ చేయడం జరుగుతుందన్నారు.

కనక దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3: విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. వరదలు, తద్వారా ఏర్పడ్డ అవస్థలు నుంచి రాష్ట్ర ప్రజలను మరీ ముఖ్యంగా విజయవాడ నగర వాసులను కాపాడాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వివరించారు.

వినాయక మండపాల ఏర్పాటుకు ఏక గవాక్ష విధానం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 3 : వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే వారికి సింగిల్‌విండో విధానంలో అనుమతుల మంజూరుకు ఏర్పాట్లు చేసినట్లు మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ మంగళవారం తెలిపారు పోలీస్‌స్టేషన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి పత్రాలను మీ సేవలో దాఖలు చేసుకొని డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 7995095800 వాట్సాప్ నెంబర్‌కు అవసరమైన వారు హాయ్ అని మెసేజ్ పెడితే అనుమతుల వివరాలు దరఖాస్తు ఫారం అందుబాటులోకి వస్తాయన్నారు. రాత్రి సమయాల్లో మండపాలు వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వంశీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎన్ఈసీ విద్యార్థిని

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 3: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని నాగాంజలి ట్రెడిషనల్ ఈవెంట్‌లో నాల్గోస్థానం, ఆర్టిస్టిక్ గ్రూప్ ఈవెంట్‌లో మూడోస్థానంలో విజయంసాధించి ఆల్ ఇండియా యోగాసన పోటీలకు ఎంపికైందని కళాశాల ఛైర్మన్‌మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఈఈఈ విభాగంలో నాల్గో సంవత్సరం చదువుతున్న డి.నాగాంజలి ఆగస్టు 31, సెప్టెంబరు 1న తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చిలో జరిగిన సౌత్‌ఇండియా యోగాసన విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. అక్టోబరు 1,2,3వ తేదీలలో దిల్లీలో జరగనున్న పోటీలలో సౌత్ ఇండియా నుంచి నాగాంజలి పోటీలలో పాల్గొనున్నారు.

ఆదివాసీయులకు మౌలిక వసతులపై అవగాహన

బొల్లాపల్లి, సెప్టెంబరు 3: మండలంలోని వెల్లటూరు, రేమిడిచర్ల, రావులాపురం గ్రామాల్లో మంగళవారం గిరిజనులకు కల్పించనున్న మౌలిక వసతులపై అవగాహన కార్యక్రమం జరిగింది. శ్రీశైలం ఐసీడీఏ పీహెచ్‌వో ధనుంజయ్, పల్నాడు జిల్లా డీటీ డబ్ల్యూవో లోతేటి వరలక్ష్మిలు గిరిజనులకు కల్పించనున్న మౌలిక వసతులపై అవగాహన కల్పించారు. శ్రీశైలం ఐసీడీఏ పీహెచ్‌వో ధనుంజయ్ ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసి నాయమ్ మహా అభిమాన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 11 పథకాలపై వారికి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పడిగ గురునాథరావు, మాజీ సర్పంచ్ కజ్జాయం లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పెంటాల వెంకటేశ్వర్లు, అర్ధలపూడి శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, ఉపాధి సిబ్బంది, ఆషా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

నూజెండ్ల, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు సరైన గృహ వసతి లేక ప్రభుత్వ పాఠశాల, చర్చిలలో ఆశ్రయం పొందుతున్న 50 కుటుంబాల వారికి మంగళవారం తహసీల్దార్ జీ రమేష్ కుమార్, టీడీపీ నాయకులు గంగినేని బాబులు నిత్యావసరాలు అందజేశారు. నిర్వాసితులైన వారికి ప్రభుత్వం తరుపున అండగా ఉండి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు తహసీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

జగన్మోహనరెడ్డి విమర్శలు సరికాదు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 3: బుడమేరు ముంపుతో వరదల్లో చిక్కుకున్న విజయవాడ వాసులను పరామర్శించేందుకు వచ్చి మాజీ సీఎం జగన్మోహనరెడ్డి చేసిన విమర్శలు సరికాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో వరద పరిస్థితి, పునరావాస కార్యక్రమాలను ప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షించారు. స్థానిక 45వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా ప్రత్తిపాటిని సీఎం చంద్రబాబు నియమించారు. ఈ మేరకు డివిజన్‌లోని సితార సెంటర్, జోజి నగర్, కబేళ సెంటర్, రోటరీ నగర్, ఏకలవ్య నగర్, బ్రహ్మయ్య నగర్, భగత్‌సింగ్ నగర్‌లలో విస్తృతంగా పర్యటించి సహాయక చర్యలు పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు దగ్గరుండి ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కష్ట సమయంలో చేతనైతే భుజంభుజం కలపి పని చేయాలి తప్ప పనిచేసే వారిపై తప్పుడు విమర్శలు చేయటం మనిషి అన్న వాడికి సరి కాదని మాజీ సీఎం జగన్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. జగన్‌రెడ్డి నిన్న హడావుడిగా వచ్చి మోకాలిలోతు నీళ్ళల్లో దిగి ప్రభుత్వంపై బురద చల్లటానికి వచ్చినట్లు ఉందన్నారు. మొట్టమొదటి సారి నీటిలో దిగారని, ఫొటోలకు ఫోజులు ఇచ్చారు తప్ప కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవటానికి సహాయక చర్యల్లో పాల్గొనాలని పార్టీ కార్యకర్తలకు కూడా పిలుపు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. 24 గంటల్లోపు విజయవాడలో సాధారణ పరిస్థితి నెలకొనే వరకు పజలను ఆదుకోవటమే లక్ష్యంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుదన్నారు.

జగన్‌రెడ్డి ఆరోపణలు నమ్మే స్థితిలో జనం లేరు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3: వరద పరిస్థితులపై జగన్‌రెడ్డి ఎన్ని ఆరోపణలు చేసినా ముంపు ప్రాంత వాసులు కానీ, ఆంధ్రప్రజలు నమ్మేస్థితిలో లేరని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వరదలు వచ్చినప్పుడు భూమిమీద కాలు మోపకుండా హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే చేసి, బాధితులను పరామర్శించిన ఘనత జగన్‌రెడ్డిదని కాగా సీఎం నారా చంద్రబాబునాయుడు అర్ధరాత్రిలో ముంపు ప్రాంతాలకు స్వయంగా నిత్యావసర వస్తువులు అందజేసి, నేను ఉన్నాను అని భరోసా కల్పించారని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సహాయ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, బుల్‌డోజర్, బందరు రోడ్డు నుంచి తెప్పించిన భారీ యంత్రంపై ఎక్కి వరదలో పర్యటించారన్నారు. ప్రతి డివిజనుకు ఓ ఐఏఎస్ అధికారిని ఇన్‌చార్జిగా నియమించారన్నారు. మంత్రులందరూ విజయవాడలోనే మకాంవేసి పునరావాస కార్యక్రమాలు వేగవంతం చేశారని చెప్పారు. ఆహారం, తాగునీటి సరఫరాకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారని చెప్పారు. ప్రాణనష్టం లేకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారని, హెల్ప్‌లైన్‌లుకు ఫిర్యాదులు అందిన వెంటనే సిబ్బందిని ఆయా ప్రాంతాలకు పంపిస్తున్నారని చెప్పారు. దాదాపు పదివేల మందిని పునరావాస శిబిరాలకు తరలించారని, అక్షయ పాత్ర సంస్థ ద్వారా లక్ష మందికి ఆహారం అందించారన్నారు. హోటల్స్ అసోసియేషన్ మరో లక్ష మందికి భోజనాలు సమకూర్చారన్నారు. కేంద్రప్రభుత్వం నుంచి సోమవారం 20పవర్ బోట్లు వచ్చాయని, ప్రత్యేక విమానంలో ఎన్డీఆర్ఎఫ్ దళాలు గన్నవరం చేరుకున్నాయని వివరించారు. అందరినీ ఆదుకుంటామని, అందరూ ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారన్నారు. విజయవాడలోనే ఉంటూ పగలూ, రాత్రీ నిర్విరామంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న అసిస్ట్ ప్రతినిధులు

అసిస్ట్ రూ.2లక్షల నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేట, సెప్టెంబరు 3: స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువైన నిత్యావసర సరుకులను 150మంది ఒంటరి మహిళలకు మంగళవారం పంపిణీచేశారు. వీరికి బియ్యం, కందిపప్పు, వంటనూనె, గోధుమపిండి అందచేశారు. హైదరాబాద్‌కు చెందిన కేఎస్‌ఏ సంస్థ ఇందుకు ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు కృష్ణ హరీష్‌జి సూర్యనారాయణ, విష్ణుప్రియ కోఆర్డినేటర్లు డేవిడ్, దుర్గారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



గురుకుల పాఠశాల సమీపంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ అధికారులు

యడ్లపాడు, సెప్టెంబరు 3: యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ పరిధిలో గురుకుల పాఠశాలకు సమీపంలోని సర్వే నం.517లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. గురుకుల పాఠశాలను ఆనుకుని సర్వే నం.517లో 2.50 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్‌వేసి కొందరు ఆక్రమించుకున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీనితో తహసీల్దార్ విజయశ్రీ స్థానిక వీఆర్వోను పరిశీలించి నివేదిక అందజేయాల్సిందిగా ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన వీఆర్వో ఫెన్సింగ్‌వేసి ఉండడాన్ని గుర్తించి తహసీల్దార్‌కు తెలియచేశారు. స్పందించిన తహసీల్దార్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్ఏతో కలసి వీఆర్వో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

నర్సింగ్ విద్యార్థులకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 3. నర్సింగ్ విద్యార్థులకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు కావల్సిన అర్హతలు ఇలా ఉండాలని కోరారు. అభ్యర్థి జపాన్ దేశంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలి. తప్పనిసరిగా ఎన్ఎం లేదా జీఎన్ఎం లేదా బీఎస్సీ పూర్తిచేసి ఉండాలి. వయస్సు 20-32 సంవత్సరాల మధ్య ఉండాలి. అవసరమైన పత్రాలు, రెజ్యూమ్, విద్యాసంబంధిత సర్టిఫికెట్లు, వ్యాలిడ్ పాస్‌పోర్టు, అనుభవ ధ్రువీకరణ పత్రాలు కలిగిఉండాలి. అభ్యర్థులకు 6 నెలల శిక్షణాకాలం ఉంటుంది. శిక్షణ జపనీస్ భాషలో ఎన్5, ఎన్4, స్కిల్, ఎన్3 లలో ఇవ్వటం జరుగుతుంది. బెంగుళూరులో జరిగే ఈ శిక్షణకు ఫీజు 3.50 లక్షలు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9988853335 నెంబరులో సంప్రదించాలని జిల్లా నైపుణ్యాధికారి కొండా సంజీవరావు తెలిపారు.